క్లుప్తంగా

రేపటి నుంచి 73వ ఉర్సు

గోల్కొండ: సయ్యద్ ఉస్ సాదత్ అల్ హసానీ వల్ హుస్సేనీ హజ్రత్ మౌలానా సిద్ధిక్ దీన్‌దార్ సన్ బస్వేశ్వర్ సాహెద్ 73వ ఉర్సే షరీఫ్ సందర్భంగా ఈ నెల 30 నుంచి 3 రోజుల ఇంటర్నేషనల్ రిలీజియస్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నామని ప్రముఖ సంఘసేవకుడు ఎస్.రాజు వస్తాద్ తెలిపారు. శనివారం గోల్కొండలో జరిగిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఈ నెల 30, 31, ఫిబ్రవరి 1న ఖాన్ ఖా ఏ సర్వర్ ఏ ఆలం వద్ద ఈ కాన్ఫరెన్స్ నిర్వహించడం జరుగుతుదంని ఆయన తెలిపారు. వివిధ రాష్ట్రాలతో పాటు పలువురు ఈ సమావేశంలో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. వివిధ మతాలకు చెందిన పెద్దలు సైతం ఈ కార్యక్రమంలో పాల్గొని శాంతి, సోదర భావంపై ప్రసంగాలు ఇస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగ రావు, పరమానందం, పండిత సయ్యద్ ఖాజాపాషా, సయ్యద్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీలో పలువురి చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల

అఫ్జల్‌గంజ్: వైఎస్సార్ తెలంగాణ పార్టీలోకి వివిధ పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుతున్నారు. పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల నాయకులకు, కార్యకర్తలకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శనివారం పార్టీ అధికార ప్రతినిధి గట్టు రామచంద్రరావు ఆధ్వర్యంలో నగరంలోని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు జుడే విన్సంట్ (జోడి భాయ్), మహమ్మద్ అజీముల్లా ఖాన్, మాణిక్ రావు, జి యాదయ్య, నింబవాల అమర్‌సింగ్ తదితర నాయకులు కార్యకర్తలతో పెద్ద ఎత్తున పార్టీలో చేరారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



బహుమతులు అందజేస్తున్న అనురాధ దేవి

గోల్కొండ: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని గోల్కొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (తెలుగు) ప్రధానోపాధ్యాయురాలు వై.ఎస్. అనురాధ దేవి అన్నారు. పాఠశాల వార్షికోత్సవాలు శనివారం ముగిశాయి. విజేతలకు ఆమె శనివారం పాఠశాలలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పోటీ పరీక్షల్లో బాగా రాణిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణపై ఎంతో కృషి చేస్తుందన్నారు. అధ్యాపకులు ఎస్. సునీల్‌కుమార్, సుబ్బారావు, హేమలత, సంధ్యారాణి పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న రాకేష్ తివారీ, గాజుల అంజయ్య

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న సరస్వతీ దేవీ పూజల్లో భాగంగా శనివారం భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ రాకేష్ తివారీ, మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తదితరులు పాల్గొన్నారు. వసంత పంచమిని పురస్కరించుకుని బెంగాలీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో వారు పాల్గొని సరస్వతి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఇద్దరి అరెస్ట్

అబిడ్స్: మానసిక స్థితి సరిగ్గా లేని ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఇద్దరి నిందితులను మంగళ్‌హాట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. గోడేకిఖబర్ కామాటిపురకు చెందిన ఓ బాలికకు మాయమాటలు చెప్పి ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారన్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న బాలిక తల్లి మంగళ్‌హాట్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన ఇద్దరి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన మంగళ్‌హాట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పచ్చదనం కనుమరుగు

- పాతబస్తీలో విద్యుత్ వైర్లకు అడ్డు తగులుతున్నాయని చెట్ల కొమ్మల నరికివేత
- విషయం తెలిసినా పట్టించుకోని అధికారులు
- ప్రత్యామ్నాయ మార్గాలున్నా ఆ దిశగా స్పందించడం లేదని ఫిర్యాదులు

చార్మినార్: పాతబస్తీలో పచ్చదనం కనుమరుగవుతోంది. తెలంగాణ హరితహారంలో భాగంగా పలు ప్రాంతాల్లో మొక్కలు నాటి పెంచాలని ఒకవైపు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించి ముందుకెళుతుంటే.. మరోవైపు కొంత మంది ఏపుగా పెరిగిన చెట్లను అడ్డంగా నరికేస్తున్నారు. అప్పుడప్పుడు టీఎస్ఎస్‌పీడీసీఎల్ సెంట్రల్ బ్రేక్ డౌన్ అధికారుల పర్యవేక్షణలో చెట్ల కొమ్మల నరికివేత కొనసాగుతోంది. వారంలో రెండు మూడు రోజులు ఏదో ఒక సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తలగింపు కార్యక్రమంలో కొనసాగుతోంది. ఈ చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియ పాతబస్తీలో నిరంతరం కొనసాగుతోంది. విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు అడ్డు తగులుతున్నాయనే కారణాలతో టీఎస్ఎస్‌పీడీసీఎల్ సెంట్రల్ బ్రేక్ డౌన్ అధికారులు, సిబ్బంది ఎక్కడికక్కడ పచ్చదనానికి గొడ్డలి పెడుతున్నారు. అవసరం ఉన్నా.. లేకున్నా పెద్ద పెద్ద కొమ్మలను తొలగిస్తున్నారు. నరికేసిన ఈ కొమ్మలను అక్కడి నుంచి తొలగించకుండా అలాగే రోడ్డుపై వదిలేసి వెళ్తుండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇష్టానుసారంగా చెట్లను నరుకుతుండడంతో ఆయా బస్తీల్లో పచ్చదనం కనుమరుగవుతోంది. ప్రత్యామ్నాయ మార్గాలున్నప్పటికీ.. ఆ దిశలో స్పందించడం లేదనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

ఏబీ కేబుల్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది..

- వీధి దీపాల కోసం బస్తీల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు అడ్డుతగులుతున్నాయనే కారణంతో టీఎస్ఎస్‌పీడీసీఎల్ తొలగిస్తున్న కార్యక్రమానికి ఫుల్‌స్టాప్ పెట్టాలంటే సాధ్యమైనంత వెంటనే ఏబీ కేబుల్(ఎయిర్ బంచ్) వ్యవస్థను అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది.
- ఏబీ కేబుల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడానికి భారీ బడ్జెట్ అవసరం ఉంటుందని సంబంధిత విద్యుత్ అధికారులు చెబుతున్నారు.
- ఎల్టీ (70 స్క్వైర్ ఎంఎం), హెచ్‌టీ (180 స్క్వైర్ ఎంఎం)లైన్‌లలో ఏబీ కేబుల్ వ్యవస్థను తీసుకు వస్తే ఆశించిన ఫలితాలుంటాయంటున్నారు.
- సాధారణ లైన్లను ఏబీ కేబుల్ కింద మార్చడానికి మూడు రెట్లు ఖర్చు అవుతుందని అందుకే ఏబీ కేబుల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం లేదని అంటున్నారు.
- ఏబీ కేబుల్ అందుబాటులోకి వస్తే పచ్చదనాన్ని కాపాడడంతో పాటు విద్యుత్ ప్రమాదాలు సైతం తగ్గుతాయని స్థానికులు అంటున్నారు.



చెట్లను నరుకుతున్న సిబ్బంది

‘మహిళలు అన్ని క్రీడల్లో రాణిస్తున్నారు’



విజేతలకు మెమొంటోలు అందజేస్తున్న సునితా లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ తదితరులు

సుల్తాన్‌బజార్: మహిళలు క్రీడల్లో పురుషులతో సమానంగా రాణిస్తూ అపరిమిత విజయాలు సాధించడంలో తమకు సతామే సాటీగా నిలుస్తున్నారని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషనర్ చైర్‌పర్సన్ సునితా లక్ష్మారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్, జాతీయ మహిళా కమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కోఠిలోని మహిళా యూనివర్సిటీలో క్రీడల్లో మహిళల పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఒకప్పుడు భారతదేశంలో క్రీడలపట్ల సాధారణ అలసత్వ వైఖరి, సాంప్రదాయ జీవన విధానం కారణంగా ప్రోత్సాహం అంతగా ఉండేది కాదన్నారు. నేడు మహిళలు అన్ని క్రీడల్లో రాణిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి క్రీడలకు ఎంతో ప్రోత్సాహం లభిస్తుందన్నారు. మహిళలకు ఏ సమస్య వచ్చినా మహిళా కమిషన్‌ను సంప్రదించాలని ఆమె కోరారు. గ్రంథాలయ మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునితా లక్ష్మారెడ్డి మహిళలకు అండగా నిలుస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ మహిళల భద్రతకు పెద్దపీట వేశారన్నారు. అనంతరం క్రీడల్లో విజేతలుగా నిలిచిన వారికి మెమొంటోలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి, పద్మ, సుద్దాల లక్ష్మి, రేవతి, కమిషన్ సెక్రటరీ కృష్ణకుమారి, మహిళా యూనివర్సిటీ ప్రిన్సిపాల్ విజ్జులత, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

సాంకేతిక విద్యను అందిపుచ్చుకోవాలి



విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేస్తున్న అంకూర్ జైన్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులు సాంకేతిక విద్యా పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సన్‌స్టోన్ సీఈఓ అంకూర్ జైన్ అన్నారు. శనివారం కింగ్‌కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో సెయింట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాల 8వ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యాభ్యాసం జరిగినప్పుడే ఆయా రంగాల్లో రాణించగలుగుతారని తెలిపారు. ఓయూ పరీక్షా విభాగం నియంత్రణ అధికారి ప్రొఫెసర్ గణేష్ మాట్లాడుతూ.. సామాన్య, వాణిజ్య రంగాల్లో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో రాణించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు మెడల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్‌లో మూడు గుడిసెలు దగ్ధం



బాధితులకు నగదు సాయం అందిస్తున్న మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాశ్

గోల్కొండ: గుడిమల్కాపూర్ డివిజన్ బోజగుట్ట శివాజీనగర్‌లో ప్రమాదవశాత్తు మూడు గుడిసెలు దగ్ధమయ్యాయి. గుడిమల్కాపూర్ మాజీ కార్పొరేటర్ చొరవతో అగ్ని ప్రమాదం తీవ్రత తగ్గింది. ఆయన కోరిక మీదట ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ పర్వీన్ షేక్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ప్రమాదానికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయామని బాధితులు ఆమె ముందు తమ గోడును వెల్లబోసుకున్నారు. బాధితుల కన్నీటి గాదకు చలించిన కార్పొరేటర్ వెంటనే తనవంతు సాయంగా ప్రమాదబాధితులకు అక్కడికక్కడే ఒక్కొక్కరికి రూ. 5వేలు ఆర్థిక సాయం అందజేశారు. కాగా ప్రభుత్వం నుంచి బాధితులకు తగిన న్యాయం ఆయన తహసీల్దార్‌ను కోరారు.

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న గాజుల అంజయ్య

చార్మినార్: కోట్ల అలిజాలోని కోట మైసమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు రాయికోటి బాబురాజా రూపొందించిన బోనాల జాతర సమాచారంతో కూడిన నూతన సంవత్సర కేలండర్‌ను మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసారి ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలతో కూడిన సమాచారాన్ని ఈ కేలండర్‌లో పొందుపరచడం అందరికీ ఉపయోగపడుతుందన్నారు. కోట మైసమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు రాయికోటి బాబురాజాతో పాటు లాల్ దర్వాజ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ లెనిన్ బాబు, బీజేపీ సీనియర్ నాయకులు శ్రీధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌లో పుస్తకావిష్కరణ

అబిడ్స్: ఎగ్జిబిషన్‌లో ముషాయిరా పుస్తకావిష్కరణ చేశారు. ఎగ్జిబిషన్ సొసైటీ ఎకనామిక్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బి.ప్రభాశంకర్, సీనియర్ సభ్యులు అశ్వక్ హైదర్, కార్యదర్శి సాయినాథ్ దయాకర్ శాస్త్రి ఈ ముషాయిరా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాశంకర్ మాట్లాడుతూ.. ముషాయిరాలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. మనిషి సంతోషంగా గడిపేందుకు ముషాయిరాలు దోహదపడుతాయన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభాశంకర్, అశ్వక్ హైదర్, సాయినాథ్ దయాకర్ శాస్త్రి

ఉత్సాహంగా ఫుడ్ ఫెస్టివల్



ఇంటిగ్రల్ స్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న మెట్టు సాయికుమార్

అబిడ్స్: జాంబాగ్‌లోని ఇంటిగ్రల్ ఫౌండేషన్ స్కూల్‌లో నిర్వహించిన చిల్డ్రన్స్ ఫుడ్ ఫెస్టివల్‌ను రాష్ట్ర కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నప్పటి నుంచే విద్యతో పాటు అన్ని రంగాల్లో ప్రావీణ్యం చెందే విధంగా విద్యాసంస్థలు కృషి చేయాలన్నారు. పిల్లలచే ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించడం ఎంతో గర్వకారణమని ఇంటిగ్రల్ ఫౌండేషన్ స్కూల్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాసవి కళాశాలలో ఐఈఈఈ అంతర్జాతీయ సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ ప్రకాశ్ చౌహాన్

గోల్కొండ: రిమోట్ సెన్సింగ్ డేటాను ప్రాసెస్ చేయడంలో ఎన్ఆర్ఎస్‌సీ పాత్ర కీలకమని ఎన్ఆర్ఎస్‌సీ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్ చౌహాన్ అన్నారు. శనివారం గోల్కొండ ఇబ్రహీంబాగ్‌లోని వాసవి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో మిషన్ ఇంటెలిజెన్స్ ఫర్ జియో అనలెటిక్స్ అండ్ రిమోట్ సెన్సింగ్ నిగార్స్ 2023 మొదటి అంతర్జాతీయ సదస్సు శనివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి డాక్టర్ ప్రకాశ్ చౌహాన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రిమోట్ సెన్సింగ్ డేటాను ప్రాసెస్ చేయడంలో తాము చేస్తున్న కృషి వల్ల దేశంలోని వివిధ రంగాలు ప్రయోజనం పొందుతున్నాయని వివరించారు. ఈ విభాగంలో మొదటి అంతర్జాతీయ సదస్సును వాసవి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ వారు నిర్వహించడానికి ముందుకు రావడం గొప్ప విషయమని ఆయన అన్నారు. జర్మనీ, న్యూజిలాండ్‌తో పాటు పలు అంతర్జాతీ ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొనడాన్ని బట్టి చూస్తే సదస్సు ప్రాధాన్యం అర్థం చేసుకోవచ్చన్నారు. వాసవి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.వి.రమణ మాట్లాడుతూ.. ఐఐటీలు, ఎన్ఐటీలు, ఈఈఈఈ, స్ప్రింగ్‌ల మొదలైన ప్రతిష్టాత్మక సంస్థ సహకారంతో ఇటువంటి అంతర్జాతీయ సదస్సులు నిర్వహించడం వల్ల అధ్యాపకులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ సదస్సులో పరిశోధకులు 175 పరిశోధన పత్రాలు సమర్పించగా వాటిలో 74 ప్రదర్శనకు ఎంపికయ్యాయని ఐటీ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.రామ్మోహన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి ఎడ్యుకేషన్ అకాడమీ ఉపాధ్యక్షులు టి.వి.సుబ్బారావు, హితేంద్ర, ప్రొఫెసర్ లక్ష్మీధర్ బెహ్రా తదితరులున్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు తప్పనిసరి

గోల్కొండ: పాఠశాలల యాజమాన్యం తమ విద్యార్థులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తుండాలని బల్దియా స్టాండింగ్ కమిటీ సభ్యుడు, షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకి ఇంటిగ్రల్ ఫౌండేషన్ స్కూల్‌లో జరిగిన వార్షిక సమాజంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే బాగా చదువుకోగలుగుతారన్నారు. విద్యార్థులకు కేవలం చదివే కాకుండా క్రీడల్లోనూ వారికి ప్రోత్సహిస్తుండాలన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ తలత్ నిగార్, చైర్మన్ మహ్మద ఖాలెద్ ముబషిర్, ప్రిన్సిపాల్ హాజ్రా తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో కార్పొరేటర్ రాషెద్ ఫరాజ్

దివ్యాంగులకు ఎలక్ట్రికల్ వాహనాల అందజేత

లిబర్టీ: సాక్ష్యం సంస్థ ఇద్దరు దివ్యాంగులకు ఎలక్ట్రికల్ వాహనాలను అందజేసింది. శనివారం ఆరెకటిక అభివృద్ధి సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సాక్ష్యం ప్రతినిధులు ధరంకారి శ్రీనివాస్, కేశవ్, శ్రీనివాస్‌లు దివ్యాంగులు పవన్, వనితలకు ఎలక్టికల్ వాహనాలను అందజేసి వారికి తోడ్పాటు అందజేశారు. ఈ సందర్భంగా ఆరెకటిక అభివృద్ధి సంఘం తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు భూంపల్లి అశోక్‌కుమార్ మాట్లాడుతూ, మానవత్వంతో ముందుకొచ్చి ఆరెకటిక దివ్యాంగులకు ఎలక్ట్రికల్ వాహనాలు అందించడం అభినందనీయమన్నారు. మహిళా విభాగం అధ్యక్షురాలు సరస్వతి కోరుట్ల చందు పాల్గొన్నారు.

వడ్డెరల సమస్యలను పరిష్కరించాలి

పంజగుట్ట: స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్నా ఇప్పటి వరకు వడ్డెరల జీవితాలు మారలేవని తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి ఐలమల్లు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన సంఘం ప్రధానకార్యదర్శి పల్లపు అశోక్, కోశాధికారి నారాయణ తదితరులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎంఆర్ఓ, కలెక్టర్లకు, ఎమ్మెల్యే, ఎంపీలు, మంత్రులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ తమను ప్రగతిభవన్ పిలిపించుకుని మునుగోడు ఎన్నికల తర్వాత తమ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నేటి వరకు పట్టించుకోలేదన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం దృష్టికి తమ సమస్యను మరోసారి తీసుకెళ్లేందుకు ఈ నెల 30న అన్ని జిల్లా కేంద్రాల్లో శాంతియుత ర్యాలీలు నిర్వహించి కలెక్టర్లకు వినతి పత్రాలు అందజేసి, ఆ తర్వాత ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేస్తామని ఐలమల్లు వెల్లడించారు. అప్పటికీ ప్రభుత్వం స్పదించకపోతే చలో ప్రగతిభవన్ కార్యక్రమాని చేపడతామన్నారు. సమావేశంలో పబ్లిసిటీ సెక్రటరీ ఎం.చెన్నయ్య, యూత్ ప్రెసిడెంట్ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐలమల్లు

తవ్వారు.. వదిలేశారు..



గోల్కొండ కఠోరహౌస్ వద్ద తవ్వి వదిలేసిన దృశ్యం

గోల్కొండ: అధికారుల ఉదాసీనత వైఖరి ప్రజలకు శాపంగా మారింది. గోల్కొండలోని చారిత్రక కఠోర హౌస్ వద్ద గత వారం డ్రైనేజీ పైప్‌లు వేసేందుకు అధికారులు కఠోర హౌస్ ప్రహరీని ఆనుకుని ఉన్న రోడ్డును తవ్వేశారు. అసలే ఈ రోడ్డుపై వాహనాల రాకపోకల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. దీనికి తోడు రోడ్డు సగం వరకు తవ్వేయడంతో ఇక్కడ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాలు కఠోర హౌస్ వద్ద నుంచి నెమ్మదిగా వెళ్లాల్సి వస్తోంది. అదే విధంగా మహ్మదీ లైన్ చౌరస్తా నుంచి కంపెనీబాగ్ బస్టాప్ వరకు నెల రోజులకుపైగా వరదనీటి పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయి. ఈ పనులు సైతం నెమ్మదిగా సాగుతుండటంతో మోతీ దర్వాజ నుంచి టోలిచౌకి వరకు వెళ్లే వారు లంగర్‌హౌస్ లేదా శాతం తలాబ్ మీదుగా వెళ్తున్నారు. అధికారులు ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పర్యవేక్షిస్తే సకాలంలో పూర్తి కావడంతో పాటు ప్రజలు ఇబ్బందులు తొలగుతాయని పలువురు అంటున్నారు.

విద్యతో పాటు సృజనాత్మకత అవసరం



హిమాయత్‌నగర్: విద్యార్థులు విద్యతో పాటు సృజనాత్మకను పెంపొందించుకోవాలని డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ మణికొండ వేదకుమార్ సూచించారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫోర్డ్ గ్రామర్ స్కూల్లో గ్రామీణ జీవనశైలి, సాంస్కృతిక, సంప్రదాయాల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. వేదకుమార్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థిలోనూ దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి ప్రోత్సహించేందుకు గ్రామీణ ప్రదర్శన ఎంతో దోహదపడుతుందన్నారు. స్కూల్ చైర్మన్ మణికొండ ప్రార్థన, ప్రధానోపాధ్యాయులు షమీదా, రామాంజుల, ఫాతిమా ఖాజిమ్ పాల్గొన్నారు.

వరద నీటి పైప్‌లైన్ ధ్వంసమైందంటూ ఆందోళన

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నం.10-బిలో ప్లాట్ నంబర్ 270-ఏ లోంచి జూబ్లీహిల్స్‌కు చెందిన వరద, మురుగు నీటి పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. అయితే ఈ పైప్‌లైన్‌ను ఆనుకొని ఇటీవల సదరు ప్లాట్ యజమాని నిర్మాణ పనులు చేపట్టాడు.సెల్లార్ తవ్వకాలతో పైప్‌లైన్ దెబ్బతిని మురుగంతా బయటికి వస్తున్నదంటూ స్థానికులు ప్లాట్ వద్దకు పెద్ద సంఖ్యలో వచ్చి జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అక్కడికి చేరుకున్న జీహెచ్ఎంసీ ఏఈ ప్లాట్ లోంచి వెళ్తున్న ఈ పైప్‌లైన్‌కు రెండువైపులా అయిదు మీటర్ల చొప్పున స్థలాన్ని వదిలి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అయితే, ఈ తవ్వకాల మూలంగా పైప్‌లైన్ ధ్వంసం కావడం వల్ల మురుగు బయటికి పారుతూ స్థానికంగా దుర్వాసన వస్తోందని, చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. వెయ్యి గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్లాట్‌లో నిర్మాణాలు చేపట్టేందుకు జీహెచ్ఎంసీ సర్కిల్-18 నుంచి తాము తీసుకున్న అనుమతుల మేరకే ప్రస్తుతం పనులు జరుగుతున్నాయని, పైప్‌లైన్‌ను ఏ మాత్రం ధ్వంసం చేయలేదని ప్లాట్ యజమాని శ్రీను వైట్ల వెల్లడించారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

రాజేంద్రనగర్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మొంద్ర సంగీతగౌరీశంకర్ అన్నారు. శనివారం ఆమె జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి డివిజన్ పరిధిలో పర్యటించారు. జలాల్ బాబానగర్‌లో ఫిరంగినాలా పూడికతీత పనులను, కబ్జాకు గురవుతున్న నాలాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలాలను కబ్జా చేసేందుకు యత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నాలాల పూడికతీత పనులను వేగవంతం చేయాలని సూచించారు. నాలాలపై జీహెచ్ఎంసీ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. 118 పిల్లర్ వద్ద హనుమాన్ దేవాలయం నుంచి లక్ష్మినగర్ కాలనీకి వెళ్లే రహదారి పార్కు సమీపంలో చిన్నదిగా ఉండడంతో భారీ వాహనాలు వెళ్లే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వెంటనే రోడ్డు వెడల్పు పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి రావుల జగన్, జీహెచ్ఎంసీ ఏఈ నర్సింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ వీరారెడ్డి పాల్గొన్నారు.

అత్తాపూర్ ఔట్‌పోస్ట్ సందర్శన



అత్తాపూర్ ఔట్ పోస్టు పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులతో పోలీసు అధికారులు

రాజేంద్రనగర్: సులేమాన్‌నగర్‌లోని డైమండ్ మిషన్ స్కూల్ విద్యార్థులు శనివారం అత్తాపూర్ ఔట్ పోస్టు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. విద్యార్థులకు పోలీస్‌స్టేషన్ పరిసరాలు, పోలీసుల విధులపై అవగాహన కల్పించారు. ఫిర్యాదులు ఎలా చేయాలి, రైటర్, ఏఎస్ఐ, ఎస్సై, సీఐ, కానిస్టేబుల్ విధులు, పోలీస్‌స్టేషన్‌లోని లాకప్ గది తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పాఠశాలలో ఆటల పోటీలతో పాటు స్వాతంత్ర సమరయోధులు వారి జీవిత చరిత్రపై కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అలాగే శాంతి భద్రతలో పోలీసుల పాత్ర అంశంపై స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు తెలిపారు.